



వినూత్న ఆవిష్కరణలు... ఆలోచింపచేసే ఎగ్జిబిట్లు.. సరికొత్త ఆలోచనలతో సందడి చేసే సాంకేతికోత్సవం ఉత్సాహంగా ప్రారంభమైంది. వరంగల్‌లోని నిట్ కళాశాల ఆడిటోరియంలో శుక్రవారం దేశంలోని వివిధ కళాశాలల విద్యార్థుల సమక్షంలో చెనాబ్ బ్రిడ్జి ఫేమ్ ప్రొఫెసర్ మాధవీలత జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. తొలి రోజు ఈవెంట్లతో విద్యార్థులు అదరగొట్టారు. విద్యార్థులు ప్రదర్శించిన ఎగ్జిబిట్లు వారి యువ మేధోమథనానికి అద్దం పట్టాయి. శాస్త్ర, సాంకేతిక రంగాల్లో నూతన ఆవిష్కరణలకు స్వాగతం పలికాయి. మొత్తంగా విద్యార్థి క్లబ్బుల పక్షాన 23 ఈవెంట్లను, నిట్‌లోని వివిధ టెక్నికల్ సొసైటీల తరుపున 31 ఈవెంట్లను ప్రదర్శించారు. ముఖ్యంగా వాహన ప్రదర్శన, బాంబ్ అవే, నియాన్ క్రికెట్, గ్రీటింగ్ రోబో, వీఆర్ స్పేస్ టూర్, కార్ రేస్, లైడిక్టర్ ఈవెంట్‌లు ఆకట్టుకున్నాయి. వీటితో పాటు పలు వర్క్‌షాపులు, నిపుణుల ప్రసంగాలు, కొత్తగా ప్రవేశపెట్టిన ఈవెంట్లు విద్యార్థుల సాంకేతిక దృక్పథానికి అద్దం పట్టాయి. ఈవెంట్లను తిలకించేందుకు విద్యార్థులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. దీంతో నిట్ క్యాంపస్ కోలాహలంగా మారింది.

- ఆంధ్రజ్యోతి, హనుమకొండ

ఆవిష్కరణలే హద్దుగా..

నిట్‌లో ఘనంగా ప్రారంభమైన

టెక్నోజియాన్-25

- ముఖ్య అతిథిగా హాజరైన ప్రొఫెసర్ మాధవీలత
- మొదటి రోజు ఆకట్టుకున్న ఈవెంట్లు
- పోటాపోటీగా పాల్గొన్న విద్యార్థులు
- సందడిగా మారిన నిట్ క్యాంపస్
- ఆవిష్కృతమైన సాంకేతిక మినీ భారతం

7



క్వాడ్ టార్క్ ఈవెంట్



టెక్నోజియాన్‌ను ప్రారంభిస్తున్న ప్రొఫెసర్ మాధవీలత

హద్దులను చెరిపేసుకో..

అలాగే పరిమితులనూ తెలుసుకో..

- అపజయాలకు వెరవకు.. విజయాల కోసం శ్రమించు..
- నిర్భయంగా ఉండు.. నిగ్గదీసి అడుగు..
- గుర్తింపు కోసం వెంపర్లాడకు.. మన శ్రమే దాన్ని తీసుకొస్తుంది
- నిట్ నాకు జీవితాన్ని, జీవిత భాగస్వామిని ఇచ్చింది..
- చెనాబ్ బ్రిడ్జి ఫేమ్ ప్రొఫెసర్ మాధవీలత
- నిట్ టెక్నోజియాన్ ప్రారంభ కార్యక్రమంలో ప్రసంగం

7

నేడు మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభం

కేసముద్రం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : కేసముద్రం వ్యవసాయ మార్కెట్‌లో శనివారం ధన్నసరి సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించే మార్క్‌ఫెడ్ మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే మురళీనాయక్ ప్రారంభించనున్నట్లు చైర్మన్ గంట సంజీవరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు మార్క్‌ఫెడ్ నాణ్యతాప్రమాణాలకు అనుగునంగా సరుకును తీసుకువస్తే పంటకు ప్రభుత్వ కనీస మద్దతు ధర క్వింటాకు రూ2400 పొందవచ్చని సూచించారు.

విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

- ప్లాస్టిక్ నిషేధాన్ని పకడ్బందీగా అమలు చేయాలి
- మానుకోట ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్

మహబూబాబాద్ టౌన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : మునిసిపల్ ఉద్యోగులు విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని మానుకోట ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ హెచ్చరించారు. మానుకోట పట్టణంలో పారిశుధ్య నిర్వహణ సరిగా లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మహబూబాబాద్ పట్టణంలో శుక్రవారం పలు వార్డుల్లో పర్యటించి, పారిశుధ్య పనులను పరిశీలించారు. అనంతరం మునిసిపల్ కార్యాలయంలో అధికారులు, సిబ్బందితో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ షాపుల ఎదుట చెత్తాచెదారం వేస్తే జరిమానాలు విధించాలన్నారు. ప్రతీ షాపు ఎదుట చెత్తడబ్బాను పెట్టుకుని అందులో వేసి మునిసిపల్ వాహనాలు వచ్చిన సమయంలో అందులో వేసేలా అవగాహన కల్పించాలన్నారు. అందుకు షాపు యాజమానులతో ఆదివారం ప్రత్యేకంగా సమావేశాన్ని ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రతీ రోజు ఉదయం మునిసిపల్ అధికారులు, శానిటేషన్ ఇన్స్‌పెక్టర్లు వార్డుల్లో పర్యటించి పారిశుధ్య పనులను పర్యవేక్షించాలన్నారు. చెత్త సేకరణ, ప్లాస్టిక్ నిషేధంపై అక్టోబరు 30 వరకు విస్తృత ప్రచారం చేసి, నవంబరు 1 నుంచి రోడ్డుపై చెత్తవేసిన, ప్లాస్టిక్ అమ్మకాలు జరిపినా జరిమానాలు వేయాలన్నారు. పట్టణంలో బెల్ట్ షాపులపై నిఘా పెట్టాలని పోలీసులను ఆదేశించారు. జిల్లా అదనపు కలెక్టర్ లెనిన్‌వత్సల్ టొప్పో



సమావేశంలో మాట్లాడుతున్న భూక్య మురళీనాయక్

(మిగతా 8లో..)

అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లల హాజరు శాతం పెంచాలి

కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్

మహబూబాబాద్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లల హాజరు శాతం పెంచాలని, వారిపై ప్రత్యేక దృష్టిపెట్టి ఎడ్యుకేషన్, హెల్త్ న్యూట్రిషన్, శానిటేషన్ తదితర అంశాలపై ప్రణాళిక ప్రకారం ముందుకు సాగాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ సూచించారు. కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం స్త్రీ, శిశు సంక్షేమశాఖ సీడీపీవోలు, సూపర్‌వైజర్లు, టీచర్లతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 1435 అంగన్‌వాడీ కేంద్రాల్లో ఎడ్యుకేషన్, హెల్త్, శానిటేషన్ పై ప్రత్యేక దృష్టిపెట్టి పిల్లల హాజరు శాతాన్ని గమనించాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటూ పౌష్టికాహారం అందించాలని, ఉదయం 9, 10, 11 గంటలకు షెడ్యూల్ ప్రకారం ఆన్‌లైన్ ద్వారా హాజరు వివరాలను పరిశీలించాలని ఆదేశించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన పోషణ పథకాలపై రూపొందించే కార్యక్రమాలను పక్కాగా నిర్వహించాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారం, కోడిగుడ్లు, బాలామృతం, రైస్ తదితర ఆహార పదార్థాలను పిల్లలు, గర్భిణీలు, బాలింతలకు క్రమం తప్పకుండా అందించాలని సూచించారు.



మాట్లాడుతున్న అద్వైత్‌కుమార్‌సింగ్

పిల్లలకు బేసిక్ లెర్నింగ్ ఎడ్యుకేషన్‌ను పూర్తిస్థాయిలో అందించాలని అందుకు టీచర్లు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. హెల్త్ ఎడ్యుకేషన్, న్యూట్రిషన్ అందించే విషయంలో నిర్లక్ష్యం వహిస్తే సంబంధిత సిబ్బందిపై చర్యలు తీసుకుంటామన్నారు. సీడీపీవోలు, సూపర్‌వైజర్లు క్షేత్రస్థాయిలో ప్రతి కేంద్రాన్ని తనిఖీ చేసి రిజిస్టర్‌లను పరిశీలించి ఏమైనా ఇబ్బందులు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. జిల్లా అదనపు కలెక్టర్ లెనిన్‌వత్సల్ టొప్పో, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సబిత, సీడీపీవోలు శిరీష, ఎలమ్మ, నీలోఫర్, కమల, లక్ష్మి, డాక్టర్ ప్రత్యూష, శ్రీనాథ్ పాల్గొన్నారు.

ఐటీడీఏను నిర్వీర్యం చేస్తున్న ప్రభుత్వం

- గిరిజన విద్యార్థులను పట్టించుకోని సర్కారు
- ఎస్టీ కమిషన్ సభ్యుడు హుస్సేన్‌నాయక్

తొర్రూరు రూరల్, అక్టోబరు24 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం నిధులు కేటాయించకుండా ఐటీడీఏను, విద్యా రంగాన్ని నిర్వీర్యం చేస్తోందని జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్‌నాయక్ ఆరోపించారు. శుక్రవారం దుబ్బతండా వద్ద ఉన్న గిరిజన వసతి గృహంలోని మరుగుదొడ్లు, పరిసరాలను, పడకగదులను పరిశీలించి, ఆయన మాట్లాడారు. గిరిజనుల ఓట్లతో అధికారంలోకి వస్తున్న ప్రభుత్వాలు ఆ విద్యార్థులను పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులకు చార్జీలు పెంచామని చెబుతున్న ప్రభుత్వం వారిపై కపటప్రేమ చూపిస్తోందన్నారు. పాఠశాల, కళాశాల వసతి గృహాల్లో మొత్తం 100 మంది వరకు విద్యార్థులు ఉంటుండగా.. వారికి పూర్తిస్థాయిలో మరుగుదొడ్లు లేవన్నారు. పడుకోవడానికి గదుల్లో బెడ్లులేక కిందపడుకోవాల్సిన పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. 15 రోజుల్లో విద్యార్థులకు కావల్సిన వసతులు కల్పించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం వేతనాలు అందించాలని వర్కర్లు, వసతి గృహంలో సమస్యలు పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ నాయకులు అమీర్ వినతి పత్రం అందజేశారు. బీజేపీ నాయకులు కొలుపుల శంకర్, పల్లె కుమార్, గట్టు రాంబాబు, చీకటి మహేష్ గౌడ్‌తో పాటు తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో వెంకటేశ్వర్లు, ఐటీడీఏ, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.



ఐటీడీఏ అధికారులతో మాట్లాడుతున్న హుస్సేన్‌నాయక్

మహా జాతరకు
నిరంతర విద్యుత్

8

అంతా మా ఇష్టం..?!

- మైనారిటీ గురుకులాల సిబ్బంది నియామకాల్లో అధికారుల ఇష్టారాజ్యం?
- నిబంధనలకు విరుద్ధంగా ఉపాధ్యాయుల భర్తీ
- పట్టించుకోని జిల్లా మైనారిటీ సంక్షేమశాఖ అధికారి

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : జిల్లా మైనార్టీ గురుకుల పాఠశాలల్లో సంబంధిత అధికారులు ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కుతూ.. అంతా మా ఇష్టం అన్నట్లుగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. తన పరిధిలోని మైనార్టీ గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా సిబ్బంది నియామకాలు చేపడుతున్నా తమకేమి సంబంధంలేనట్లుగా జిల్లా మైనార్టీ సంక్షేమశాఖ అధికారి వ్యవహరిస్తున్నారా.! లేదా? ఆయన కనుసన్నల్లోనే ఈ నియామకాలు జరుగుతున్నాయా అనే అనుమానాలు తలెత్తుతున్నాయి.

మానుకోట పట్టణానికి చెందిన ఓ మహిళ రెండేళ్లుగా డోర్నకల్ మైనార్టీ గురుకుల బాలికల పాఠశాలలో ఔట్ సోర్సింగ్ పద్ధతిలో భౌతిక రసాయన శాస్త్రం (సైన్స్) ఉపాధ్యాయురాలిగా విధులు నిర్వహిస్తున్నారు. గత విద్యాసంవత్సరం చివరలో పాఠశాలలో పని చేసే కొంతమంది ఉపాధ్యాయులు సైన్స్ ఉపాధ్యాయురాలు పాఠ్యాంశాలు సరిగా బోధించడం లేదని తొమ్మిదో తరగతి విద్యార్థినులచే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయించారు. వాటి ఆధారంగా సదరు ఉపాధ్యాయురాలిని ఉద్యోగం నుంచి తొలగించాలంటూ పాఠశాలకు చెందిన ఓ అధికారి తెలంగాణ మైనార్టీ గురుకుల పాఠశాల సెక్రటరీకి ఉత్తరం రాసినట్లు తెలిసింది. దీంతో ఈ విద్యాసంవత్సరం ప్రారంభం తొలిరోజే సైన్స్ ఉపాధ్యాయురాలిని హోల్డ్‌లో పెడుతూ పాఠశాలకు రావొద్దని ఆదేశించినట్లు సమాచారం!

ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఎవరైనా ఉద్యోగిపై ఫిర్యాదు వస్తే వాస్తవాలను తెలుసుకునే క్రమంలో ప్రిన్సిపాల్ ఆ ఉద్యోగికి ఫిర్యాదుపై వివరణ కోసం మెమో లేదా షోకాజ్ నోటీసు ఇవ్వాల్సి ఉంటుంది. అలాంటిది ఏమి లేకుండా నేరుగా ఆమెను విధుల నుంచి తప్పించడం అనుమానాలకు



డోర్నకల్ మైనారిటీ గురుకుల పాఠశాల

(మిగతా 8లో..)

నాణ్యమైన విత్తనాలు సరఫరా చేయాలి

- జిల్లా వ్యవసాయ అధికారి విజయలక్ష్మి

కురవి, అక్టోబర్ 24 (ఆంధ్రజ్యోతి) : రైతాంగం యాసంగికి సమాయత్తం అయ్యే సమయానికి డీలర్లు నాణ్యమైన విత్తనాలు అమ్మాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారిణి విజయలక్ష్మి అన్నారు. కురవి మండల కేంద్రంలోని వివిధ ఫెర్టిలైజర్ షాపులను శుక్రవారం ఆమె తనిఖీచేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విత్తనాలు కొన్న ప్రతీ రైతుకు రశీదు తప్పనిసరిగా ఇవ్వాలని ఆదేశించారు. స్టాక్ బోర్డులు ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని డీలర్లకు సూచించారు. అనంతరం ధాన్యం కొనుగోలు కేంద్రాల గూర్చి ఐకేపీ సిబ్బందికి ఇచ్చిన శిక్షణ కార్యక్రమంలో మాట్లాడారు. కొనుగోలు కేంద్రాలకు ధాన్యాన్ని తెచ్చే రైతులు పంట పూర్తిగా పరిపక్వతకు వచ్చిన తర్వాతే ధాన్యం కోత చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ విజయ, ఏవో నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.



కురవిలో ఫెర్టిలైజర్ షాపును తనిఖీ చేస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి విజయలక్ష్మి

పెరిగిన ధరలకు అనుగుణంగా కూలీల రేట్లు పెంచాలి

● తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు రాజన్న



మాట్లాడుతున్న బాణాల రాజన్న

మరిపెడ రూరల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : పెరిగిన ధరలకు అనుగుణంగా కూలీలకు రేట్లు పెంచాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బాణాల రాజన్న డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని ఎల్లంపేటలో వ్యవసాయ కూలీల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవసాయ కార్మికులకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలన్నారు. భూమి లేని కూలీలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసాను అమలు చేయాలని, కూలీలకు ఏటా రూ.12 వేలు, మహిళలకు నెలకు రూ.2500, వృద్ధాప్య, వితంతు, దివ్యాంగుల, ఒంటరి మహిళలకు పెంచిన పెన్షన్‌లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రేషన్ కార్డులపై 14రకాల నిత్యావసర సరుకులను పంపిణీ చేయాలన్నారు. ఈ సమావేశంలో తాడూరి వీరెంకులు, బత్యం భద్రమ్మ, వీరన్న, దుండి వెంకటయ్య, చిలకమ్మ, షేక్ జాని, గాడిపల్లి ఉప్పమ్మ, ఆలేటి భాగ్యమ్మ, కండే సుభద్ర తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు చట్టాలపై అవగాహన



దంతాలపల్లి పోలీస్‌స్టేషన్‌లో చట్టాలపై విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎస్సై పిల్లల రాజు

దంతాలపల్లి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : పోలీసులు ఓపెన్ హౌస్ కార్యక్రమం ద్వారా చట్టాలపై అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా స్థానిక ఎస్సై పిల్లల రాజు మాట్లాడుతూ పోలీసుల రోజువారీ విధులు, ప్రవర్తనా నియమావళిని వివరించారు. అపరిచితులపట్ల అప్రమత్తంగా ఉండాలని, భద్రతకు సంబంధించిన ఏ సందేహాలనైనా నివృతి చేసుకోవడానికి డయల్ 100కు కాల్ చేయాలన్నారు. పోలీస్‌స్టేషన్‌లో ప్రజలకు అందించే వివిధ సేవలు, రక్షణలపై వివరించారు. పోలీసుల త్యాగాలు, అమరవీరులైన పోలీసుల త్యాగాలను వివరించారు. దేశ రక్షణలో పోలీసుల పాత్ర కీలకమన్నారు. విద్యార్థులు ఇష్టపడి చదివితే బంగారు భవిష్యత్ ఉంటుందన్నారు. బాల్యంలో చెడు అలవాట్లకు పాల్పడితే సమాజంలో పేరు ప్రతిష్టతను కోల్పోతారన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్సై చందర్, ఇతర పోలీసు సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సీఈవో పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

డోర్నకల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): దాశరథి మహిళ రైతు ఉత్పత్తిదారుల డోర్నకల్ సంస్థలో తాత్కాలిక పద్ధతిన సీఈవోగా పనిచేసేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. అభ్యర్థులు అగ్రికల్చర్ బీఎస్సీలో మార్కెటింగ్, బిజినెస్ విభాగంలో డిగ్రీ లేదా డిప్లొమా అర్హత కలిగి ఉండాలి. ఈ నెల 30న ఇంటర్వ్యూలు నిర్వహిస్తారు. చిన్నగూడూరు, మరిపెడ, డోర్నకల్ మండలాలకు చెందిన అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలని ఆ సంస్థ చైర్మన్ కొప్పు కళావతి, వైస్ చైర్మన్ ఎండల పద్మ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

కానరాని ల్యాబ్ టెక్నిషియన్, ఫార్మసిస్టు సేవలు

దంతాలపల్లి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : దంతాలపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గత రెండు సంవత్సరాలుగా వివిధ రక్త పరీక్షలు స్థానికంగా నిలిచిపోయాయి. ఇటు ప్రభుత్వ వైద్యాధికారులు మాత్రం టీహబ్ ద్వారా రోగులకు కావాల్సిన పరీక్షలు చేస్తున్నట్లు ప్రకటించింది. కాని దంతాలపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మాత్రం విరుద్ధంగా ఉంది. పీహెచ్‌సీలో పని చేస్తోన్న ఫార్మసిస్టుతో పాటు ల్యాబ్ టెక్నీషియన్‌ను బదిలీపై పంపారు. దీంతో పీహెచ్‌సీకి వచ్చే రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతూ ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారు. కొందరు ప్రైవేటు ల్యాబ్‌లో రక్త పరీక్షల కోసం వివిధ ప్రైవేటు ల్యాబ్‌లకు వెళ్తున్నారు. పీహెచ్‌సీకి ఇటీవల బదిలీపై వచ్చిన ల్యాబ్ టెక్నీషియన్ పైరవీతో తొర్రూరు ఆస్పత్రిలో విధులు నిర్వర్తిస్తున్నట్లు రోగులు తెలిపారు. స్థానిక వైద్యాధికారుల నిర్లక్ష్య కారణంగానే ల్యాబ్‌టెక్నీషియన్ రావడం లేదనే విమర్శలు వస్తున్నాయి. పీహెచ్‌సీ నుంచి జిల్లా కేంద్రానికి ప్రతి రోజు తీసుకెళ్లే రక్త పరీక్షలను (రక్త పూతల సేకరణ) సైతం వారానికి మూడు రోజులే చేయడంతో బీపీ, షుగర్ రోగులు ఇబ్బందులు పడుతున్నారు. టీహబ్‌లో ముఖ్యంగా లిపిడ్ ప్రొఫైల్ తోపాటు క్రియాటిన్, ఆర్ఎఫ్టీ, ఎల్ఎఫ్టీ, థైరాయిడ్, హెచ్‌బీఏ1సీ పరీక్షల కోసం రోగులు రూ. వేలల్లో ఖర్చు చేయలేకపోతున్నామని వాపతున్నారు. ఇకనైన పీహెచ్‌సీలో వైద్య సేవలతో పాటు వివిధ రక్త పరీక్షలను అందుబాటులో తేవాలని మండల ప్రజలు కోరుతున్నారు. దీనిపై వైద్యాధికారి కవితను వివరణ కోరగా టీహబ్ ద్వారా పరీక్షలను నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేస్తామన్నారు. ల్యాబ్‌టెక్నీషియన్‌ను త్వరలో తిరిగి పంపిస్తామన్నారు.



పీహెచ్‌సీలో నిరుపయోగంగా ల్యాబ్ పరికరాలు

గుట్టు చప్పుడుగా ఇసుక రవాణా

● అంతా మామూలేనని వదిలేస్తున్న అధికారులు



గుట్టు చప్పుడుగా ట్రాక్టర్లలో ఇసుక రవాణా చేస్తున్న దళారులు

మరిపెడ, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : గుట్టు చప్పుడుగా ఇసుక రవాణా జోరుగా జరుగుతున్న అంతా మామూలేనని అధికారులు చూసి చూడనట్లు వదిలేయడంతో ఇక ఇసుక దందా మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతోంది. ఇందిరమ్మ ఇళ్ల పర్మిషన్ పేరుతో కూపన్లు పొందిన దళారులు ఇటు ఆకేరు, అటు పాలేరు వాగుల నుంచి నిత్యం వందల ట్రిప్పుల ఇసుకను మరిపెడ, ఖమ్మం పట్టణాలకు తరలిస్తున్నారు. నియంత్రించాల్సిన మైనింగ్, రెవెన్యూ, పోలీస్ అధికారులు గుట్టుగా ఉండడంపై జనం నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మండలంలోని తానంచర్ల రెవెన్యూ పరిధి మూలమర్రితండా జీపీ సమీపంలోని పాలేరు వాగు నుంచి, తాళ్లూకల్, ఉల్లెపల్లి, బాల్నిధర్మారం, తండాధర్మారం, పీఎస్ గూడెం, చిన్నగూడూరు మండలం ఉగ్గంపల్లి, విస్సంపల్లి పరిసరాలలోని ఆకేరు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తూ దళారులు దందా సాగిస్తున్నారు.

ఇసుక తోడేయడంతో భూగర్భ జలాలు అడుగంటిపోతాయని రైతన్నలు తలలు పట్టుకుంటున్నారు. ఓ వైపు సాగైనా పంటలకు యూరియా దొరకకు తిప్పలు పడుతున్న అన్నదాతలకు మరో వైపు ఇసుక తరలింపుతో రబీకి నీటి ఎద్దడి పొంచి ఉందని రైతులు ఆందోళనకు గురవుతున్నారు. అధికారులు కన్నెర్ర చేస్తేనే ఇసుక దందాకు చెక్ పెట్టొచ్చునని కోటి ఆశలతో ఎదురు చూస్తున్నారు.

బంగారు గొలుసు చోరీ

పెద్దవంగర, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : మహిళ మెడలో నుంచి బంగారు గొలుసును దుండగులు లాక్కెళ్లిన ఘటన మండల కేంద్రం శివారులో రామచంద్రుతండా ఎక్స్ రోడ్డు చోటు చేసుకుంది. శుక్రవారం ఏఎస్సై హీదయాత్ ఆలీ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని వడ్డెకొత్తపల్లి గ్రామానికి చెందిన గుమ్మడవెల్లి ఇందిర- వెంకటేశ్వర్లు దంపతులు వరంగల్‌లో జరిగిన బంధువుల వివాహ వేడుకలకు వెళ్లారు. తిరిగి ద్విచక్రవాహనంపై తొర్రురు నుంచి ఇంటికి వస్తుండగా మార్గమధ్యలో రామచంద్రుతండా ఎక్స్ రోడ్డు వద్దకు రాగానే వెనుక నుంచి ద్విచక్రవాహనంపై వచ్చిన ఇద్దరు దుండగులు ఇందిర మెడలో నుంచి 18 గ్రామాల బంగారం గొలుసును లాక్కుని పరారయ్యారు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పూర్తి దర్యాప్తు చేపడుతున్నట్లు ఏఎస్సై తెలిపారు.

ఎంబీబీఎస్ సీటు సాధించిన విద్యార్థికి సాయం

నెల్లికుదురు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బ్రాహ్మణ కొత్తపెల్లి గ్రామానికి చెందిన జెల్ల అనిల్‌కుమార్ - శిరీష దంపతుల కుమారుడు జెల్ల అక్షయ్‌కుమార్ భద్రాద్రి కొత్తగూడెం మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ సీటు సాధించించాడు. నిరుపేద కుంటుబానికి చెందిన అక్షయ్‌కుమార్‌కు మహా ఆదిసేన సమితి ఆధ్వర్యంలో మాస్ సంస్థ ప్రతినిధులు డాక్టర్ అలువాల విజయ్‌కుమార్, డాక్టర్ సినపెల్లి విజయ్‌కుమార్‌లు రూ. 20వేల ఆర్థికసాయం అందజేశారు. నిరుపేద విద్యార్థులకు ఆర్థిక సాయం అందజేస్తున్న మాస్ సంస్థకు జెల్ల అక్షయ్‌కుమార్ కుటుంబసభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.



అక్షయ్‌కుమార్‌కు ఆర్థిక సాయం అందచేస్తున్న దృశ్యం

కల్లుగీత కార్మికుల సమస్యలను పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న కల్లుగీత కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గౌని వెంకన్న

పెద్దవంగర, అక్టోబర్ 24 (ఆంధ్రజ్యోతి) : కల్లుగీత వృత్తిపై ఆధారపడి జీవిస్తున్న కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కల్లుగీత కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గౌని వెంకన్న డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో కల్లుగీత కార్మిక సంఘం నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వృత్తిలో ప్రమాదం అని తెలిసి ప్రాణాలు తెగించి గీత వృత్తి కొనసాగిస్తున్న కార్మికుల పట్ల ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. ప్రమాదవశాత్తు మరణించిన గీత కార్మికుల కుటుంబ సభ్యులకు అందించే ఎక్స్‌గ్రేషియా అందించడంలో ఏండ్ల తరబడి జాప్యం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రమాదాల నివారణకు అందిస్తున్న కాటమయ్య రక్షణ కిట్లు పూర్తిస్థాయిలో అందలేదన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. రూ.4వేల పింఛన్, రూ.10లక్షల ఎక్స్‌గ్రేషియా, మద్యంషాపు టెండర్లలో 25శాతం పెంచాలన్నారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. మండల గౌరవ అధ్యక్షుడిగా బొమ్మెర వెంకన్న, గౌరవ సలహాదారులుగా బీసు యాదగిరి, మండల అధ్యక్షుడిగా అనపురం చంద్రమౌళి, ఉపాధ్యక్షులు బీసు యాకయ్య, ప్రధాన కార్యదర్శిగా కొయ్యేటి యాకయ్య, సహాయకార్యదర్శిగా ఎరుకలి సమయ్య, కోశాధికారిగా మొమ్మెర సోమయ్య, కమిటీ సభ్యులుగా గురువయ్య, సోమయ్య, తండాల సంపత్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో యమగాని వెంకన్న, మోహన్, శ్రీనివాస్, మధు, తదితరులు పాల్గొన్నారు.

మహా సభలకు తరలిన జీపీ కార్మికులు



నినదాలు చేస్తున్న దంతాలపల్లి జీపీ కార్మికులు

దంతాలపల్లి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : జీపీ కార్మికుల రాష్ట్ర ఐదవ మహాసభలకు మండలంలోని గ్రామ పంచాయతీ కార్మికులు చలో గార్లకు భారీగా తరలి వెళ్లారు. ఈసందర్భంగా జీపీ సంఘం మండల అధ్యక్షుడు కందగట్ల యాకన్న మాట్లాడుతూ ప్రభుత్వాలు మారుతున్నప్పటికీ జీపీ కార్మికులపై సవతి ప్రేమను చూపిస్తున్నారన్నారు. గ్రామంలో నెలకొన్న పలు సమస్యలును పట్టించుకొని రోజువారీగా విధులు నిర్వహిస్తోన్న తమపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపడం లేదన్నారు. కనీస వేతన చట్టంను అమలు చేసి తమ కుటుంబాలను ఆదుకోవాలన్నారు. 24 గంటల పాటు గ్రామాల్లో పారిశుద్ధ్యం లోపించకుండా పనులు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు కారం సురేశ్, జీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కార్మికులు సంఘటితంగా ఉద్యమించాలి

● సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భాస్కర్

గార్ల, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : కేంద్రప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక చట్టాలను సంఘటిత, అసంఘటిత రంగ కార్మికులు కలిసికట్టుగా ఉద్యమించాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ పిలుపునిచ్చారు. గార్లలో శుక్రవారం జరిగిన గ్రామ పంచాయతీ కార్మికుల 5వ రాష్ట్ర మహాసభల సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన పాల్గొని, ప్రసంగించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ కార్పొరేట్ విధానాలు అవలంబిస్తూ కార్మికుల హక్కులను హరిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిలో భాగంగా కార్మికులకు పని గంటలు పెంచారని విమర్శించారు. తెలంగాణ రాష్ట్రంలో ఎన్నో అంశాలపై ప్రజలకు హామీలిచ్చి, అధికారంలో వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వీటిని మరచి పాలన చేస్తోందన్నారు. జీపీ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించి, కారోబార్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రానున్న రోజుల్లో జీపీ కార్మికులు చేపట్టే ఆందోళనకు సీఐటీయూ సంపూర్ణ మద్దతు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వంగూరి రాయులు, రాష్ట్ర నాయకులు ఎస్.రమాదేవి, పాలడుగు భాస్కర్, సీఫైటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చాగంటి వెంకటయ్య, మండల నాయకులు కందునూరి శ్రీనివాస రావు, అలవాల సత్యవతి, కుంటా ఉపేందర్, ఆకుల రాజు, కుమ్మరి కుంట్ల నాగన్న, బండ్ల అప్పిరెడ్డి, దాసు, దస్తగిరి పాల్గొన్నారు.



బహిరంగ సభలో ప్రసంగిస్తున్న పాలడుగు భాస్కర్

వైద్య సిబ్బందిని నియమించాలి



పల్లె దవాఖాన ఎదుట ఆందోళన చేస్తున్న సీపీఎం కార్యకర్తలు

గార్ల అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పినిరెడ్డి గూడెం గ్రామంలో ప్రభుత్వ నిర్మించిన పల్లె దవాఖానలో పూర్తిస్థాయి వైద్య సిబ్బందిని నియమించాలని సీపీఎం మండల నాయకుడు వంగూరి పెద్ద వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. శుక్రవారం సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో ప్రభుత్వ నిర్మించిన పల్లె దవాఖానలో సిబ్బందిని నియమించాలని కోరుతూ ఆస్పత్రి ఎదుట గ్రామస్థులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో అనేక మంది బీపీ షుగర్ లాంటి దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతూ జీవిస్తున్నారన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు మెరుగైన వైద్య సదుపాయం అందుబాటులోకి తీసుక రావాలన్నారు. ఈ కార్యక్రమంలో వంగూరి కొండయ్య, కేలోత్ బాలాయక్, గుగులోత్ సీతారాంనాయక్, భద్రు, లింగమ్మ, శారద, లక్ష్మి, ద్వాలి, మంగమ్మ, మౌనిక, సీతా, నారాయణ, పుల్లయ్య, ఎల్లయ్య పాల్గొన్నారు.

త్రివర్ణ పార్కు అభివృద్ధికి కృషి చేద్దాం

మహబూబాబాద్ టౌన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : మానుకోట పట్టణంలోని త్రివర్ణపార్కు అభివృద్ధికి కలిసికట్టుగా చేసుకుందామని సీపీఐ మాజీ మునిసిపల్ ఫ్లోర్‌లీడర్, త్రివర్ణపార్కు అభివృద్ధి కమిటీ చైర్మన్, బి.అజయ్‌సారథిరెడ్డి అన్నారు. మహబూబాబాద్ ఇందిరా గ్రౌండ్ వద్ద ఉన్న త్రివర్ణపార్కుకు శుక్రవారం నేమ్ బోర్డును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాడు గ్రీన్‌ల్యాండ్ అన్యాక్రాంతం కాకుండా సీపీఐ ఆధ్వర్యంలో అనేక ఆందోళనలు చేపట్టి రూ.కోటి నిధులతో పార్కును అభివృద్ధి చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో విజయ్‌కుమార్, బూద్యానాయక్, లింగారెడ్డి, శ్రీనాథ్, శ్రీనివాస్‌రెడ్డి, రమేష్, నారాయణ, కృష్ణప్రసాద్, సాదిక్, నర్సయ్య, రాములు, వెంకన్న, జగదీష్, అజయ్‌కుమార్‌రెడ్డి, సత్యనారాయణ, పెరుగుకుమార్, రవి, శ్యాంప్రసాద్, రవిచంద్రబోస్, శేఖర్ పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న అజయ్‌సారథిరెడ్డి

ఉత్తమ సేవలకు గుర్తింపు

సీపీ నుంచి జ్ఞాపిక అందుకున్న ఎస్సై రాజ్‌కుమార్



ప్రశంసాపత్రంతో ఎస్సై రాజ్‌కుమార్, సిబ్బంది

కొత్తగూడ, అక్టోబర్ 24 (ఆంధ్రజ్యోతి): ఉత్తమ సేవలు అందించిన ఎస్సై రాజ్‌కుమార్ ఎస్పీ సుధీర్‌రాంనాథ్ కేకన్ చేతుల మీదుగా ఉత్తమ సేవ జ్ఞాపికను శుక్రవారం అందుకున్నారు. ఖరీఫ్ సీజన్‌లో ప్రభుత్వం రైతులకు అందిస్తున్న యూరియా పంపిణీ కార్యక్రమంలో ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ప్రత్యేక చర్యలు తీసుకుని, తమ సిబ్బందితో సేవలు అందించారు. అనారోగ్యం బారిన పడిన రైతులను సకాలంలో ఆస్పత్రికి తరలించి, చికిత్స అందించడంలో ఎస్సై ప్రత్యేక చొరవ తీసుకున్నారు. కాగా, ఉత్తమ సేవ జ్ఞాపికను పొందిన ఎస్సై రాజ్‌కుమార్‌కు, సిబ్బందికి పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

బోనస్ ఇవ్వడంలో సర్కారు విఫలం

● ఎంసీపీఐ జిల్లా కార్యదర్శి పానుగంటి నర్సయ్య

గూడూరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : యాసంగి ధాన్యం సేకరించే ముందు రైతులకు క్వింటాకు రూ.500 అదనంగా బోనస్‌ను అదనంగా ఇస్తామని చెప్పి, నాలుగు నెలలు గడుస్తున్నా నేటికి ఆ ఊసే లేదని, తిరిగి వానాకాలం పంటలకు కూడా ఇస్తామని చెప్పడం విడ్డూరంగా ఉందని ఎంసీపీఐ జిల్లా కార్యదర్శి పానుగంటి నర్సయ్య అన్నారు. గూడూరులో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. కేంద్రప్రభుత్వం ప్రకటించిన మొక్కజొన్న, పత్తిని మద్దతు ధరకు కొనుగోలు చేస్తామని చెప్పి, ఇంత వరకు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయలేదన్నారు. అధిక వర్షాలకు రైతులు తీవ్రంగా నష్టపోయి వచ్చిన కాస్త దిగుబడి ప్రైవేట్ వ్యాపారులకు అమ్ముకోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల పరిస్థితి దయనీయంగా ఉందని, ప్రభుత్వం వెంటనే మద్దతు ధర ఇచ్చేందుకు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఆ పార్టీ నాయకులు నర్సయ్య, మల్లయ్య, చందు, మంగీలాల్, యాకూబ్ పాల్గొన్నారు.

వెయిట్‌లిఫ్టింగ్ పోటీలకు జిల్లా జట్టు

డోర్నకల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : వెయిట్‌లిఫ్టింగ్ పోటీలకు మహిళ, పురుష విభాగంలో మహబూబాబాద్ జిల్లా జట్టు ఎంపిక స్థానిక హనుమాన్ వ్యాయామశాలలో నిర్వహించారు. దీనిలో సీనియర్, జూనియర్ విభాగాల్లో వివిధ కేటగిరిలో జిల్లా జట్టును ఎంపిక చేసినట్లు జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్త రాంబాబు తెలిపారు. పురుషులు 60 కేజీల విభాగంలో చరణ్, 65 కేజీల విభాగంలో కె.ఈశ్వర్, 79 కేజీల విభాగంలో ఎం.అరుణ్‌కుమార్, 88 కేజీల విభాగంలో సాయి కార్తీక్, 94 కేజీల విభాగంలో రాహుల్‌వర్మలు, మహిళ జట్టులో 58 కేజీల విభాగంలో ఎం.స్వాతి, 69 కేజీల విభాగంలో భావనలు ఎంపికనట్లు ఆయన తెలిపారు. జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు హన్మకొండ జేఎన్ఎస్ స్టేడియంలో నవంబర్ 7 నుంచి 9 జరిగే పోటీల్లో జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించనున్నట్లు రాంబాబు తెలిపారు.

ప్రేమ పేరుతో మోసం చేసిన వ్యక్తిపై కేసు

డోర్నకల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : ప్రేమ పేరుతో ఓ మహిళను మోసం చేసిన వ్యక్తిపై బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఉమ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం. మండలంలోని ఓ తండాకు చెందిన 28 ఏళ్ల మహిళను చాంప్లాతండాకు చెందిన అజ్మీర రవి ప్రేమిస్తున్నానంటూ పెళ్లి చేసుకుంటానని నమ్మించాడు. సదరు మహిళ పెళ్లి చేసుకోవాలని ఒత్తిడి తీసుకురావడంతో మొఖం చాటేశాడు. ఎన్నిసార్లు ఫోన్ చేసినా స్పందించకపోవడంతో తనకు న్యాయం చేయాలని కోరుతూ.. మహిళ డోర్నకల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు రవిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

యూటీఎఫ్ నూతన కమిటీ ఏర్పాటు

కురవి, అక్టోబర్ 24 (ఆంధ్రజ్యోతి) : సీరోలు మండల యూటీఎఫ్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు జిల్లా కార్యదర్శి పి.మంజుల, పరిశీలకుడు షేక్ యాకూబ్ తెలిపారు. మండల అధ్యక్షురాలిగా శకుంతల, ప్రధాన కార్యదర్శిగా జె.కృపాకర్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా ఎంఏ సత్తార్, ఎస్కే నూర్జహాన్, కోశాధికారిగా పి.కల్యాణ్, కార్యదర్శులుగా సత్యనారాయణ, నాగరాజు, కల్పన, రాజేందర్, ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా లక్ష్మీనర్సయ్య, సభ్యులుగా విజయ, సురేష్, జిల్లా కమిటీ ప్రతినిధులుగా వి.భాస్కర్‌రావు, విక్టోరియా, ఎఫ్‌డబ్ల్యూఎఫ్ కన్వీనర్‌గా శాంతకుమారి, అకడమిక్ కన్వీనర్‌గా వజ్రకుమారి ఎన్నికయ్యారని తెలిపారు. ఈ సందర్భంగా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

విద్యార్థులకు అవగాహన కల్పించిన ఎస్సై తిరుపతి

బయ్యారం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): సమాజంలో జరిగే సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎస్సై తిరుపతి విద్యార్థినులకు సూచించారు. శుక్రవారం పోలీస్‌స్టేషన్‌లో కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీఎస్) విద్యార్థినులకు సైబర్ నేరాలతో పాటు డయల్ 100, కమ్యూనికేషన్ తదితర అంశాల్లో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై విద్యార్థినులకు పలు సూచనలు చేశారు. రోజురోజుకు పెచ్చుమీరుతున్న సైబర్ నేరాల ఉచ్చులో పడి, తమ భవిషత్తును నాశనం చేసుకోవద్దన్నారు. ఖాళీ సమయాల్లో స్మార్ట్‌ఫోన్ వినియోగం పట్ల అప్రమత్తంగా ఉండాలని, అనవసరమైన లింకులు, అప్లికేషన్లు ఓపెన్ చేయొద్దన్నారు. ముఖ్యంగా సస్పెక్టెడ్ కాల్స్ విషయంలో జాగ్రత్త వహించాలన్నారు. కష్టంతో ఇష్టంగా చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రొహిబిషన్ ఎస్సై మహబూబీ, ఏఎస్ఐ శ్రీనివాస్, సిబ్బంది వెంకటేశ్వర్లు, రమేష్ పాల్గొన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై తిరుపతి



వాహన ప్రదర్శన

నిట్ విద్యార్థులు స్వయంగా డిజైన్ చేసి తయారు చేసిన రెండు వాహనాలు- క్వాడ్ బైక్, ఎఫ్-1 విద్యార్థులను విశేషంగా ఆకట్టుకున్నాయి. వీటిని ముఖ్య అతిథిగా హాజరైన ప్రొఫెసర్ మాధవీలత స్వయంగా సందర్శించారు. వాటి గురించి ఆసక్తిగా అడిగి తెలుసుకున్నారు. ఈ వాహనాలు అన్ని అడ్డంకులను అధిగమించి వేగంగా దూసుకుపోతాయి.

సాంకేతికోత్సవం షురూ

- మొదటి రోజు ఆకట్టుకున్న ఈవెంట్లు
- పోటాపోటీగా పాల్గొన్న విద్యార్థులు
- సందడిగా మారిన నిట్ క్యాంపస్
- వినూత్న ఆవిష్కరణలు.. ఆలోచింప చేసే ఎగ్జిబిట్లు
- నిట్ క్యాంపస్‌లో ఆవిష్కృతమైన సాంకేతిక మినీ భారతం

హనుమకొండ, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): వరంగల్ నిట్‌లో టెక్నోజియాన్-2025 అంగరంగ వైభవంగా ప్రారంభమైంది. క్యాంపస్‌లోని అంబేడ్కర్ లర్నింగ్ సెంటర్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమానికి విద్యార్థులు, అధ్యాపకులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ప్రపంచలోనే అత్యంత ఎత్తైన చినాబ్ వంతెన నిర్మాణంలో కీలకపాత్ర పోషించిన బెంగుళూరు ఐఐఎస్‌సీ ప్రొఫెసర్ మాధవీలత ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించగా స్టూడెంట్ వెల్ఫేర్ డీన్ ప్రొఫెసర్ కె.కిరణ్ కుమార్, స్టూడెంట్ అక్టివిటీ సెంటర్ (ఎస్ఏసీ) ప్రెసిడెంట్ ప్రొఫెసర్ హరిప్రసాద్‌రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ (టెక్నికల్) ప్రొఫెసర్ యు.వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

నవ ఆవిష్కరణల వేదిక

టెక్నోజియాన్-2025 నూతన సాంకేతిక ఆవిష్కరణలకు వేదికగా నిలిచింది. ఇందులో విద్యార్థులు ప్రదర్శించిన ఎగ్జిబిట్లు, నిర్వహిస్తున్న వారి యువ మేథోమథనానికి అద్దం పడుతున్నారు. శాస్త్ర, సాంకేతిక రంగాల్లో నూతన ఆవిష్కరణకు స్వాగతం పలుకుతున్నాయి. మొదటి రోజు విద్యార్థి కబ్బుల పక్షాన 23 ఈవెంట్లను, నిట్‌లోని వివిధ టెక్నికల్ సొసైటీల తరుపున 31 ఈవెంట్లను ప్రదర్శించారు. వీటితో పాటు పలు వర్క్‌షాపులు, నిపుణుల ప్రసంగాలు, కొత్తగా ప్రవేశపెట్టిన ఈవెంట్లు విద్యార్థుల సాంకేతిక దృక్పథానికి అద్దం పట్టాయి. ఈవెంట్లను తిలకించేందుకు విద్యార్థులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. నిట్ క్యాంపస్ కోలాహలంగా మారింది. ప్రారంభోత్సవ కార్యక్రమం అనంతరం విద్యార్థులంతా ఈవెంట్ల నిర్వహణలో బిజీ అయిపోయారు.

నేటి ఈవెంట్లు

ట్రెజర్ హంట్, రాకెట్, మర్డర్ మిస్టరీ, డీఆడిట్, ఆప్టీమిస్టరీ, నోబగ్స్, లైట్ పెయింటింగ్, మోషన్ క్యాప్చర్, స్కైస్కాట్, మెక్ కిట్, బ్లేంజ్, ఆఫ్ ట్రాక్ ఆర్సీ, ప్రాజెక్టు ఎక్స్‌పో, మొబైల్ జో, షార్క్, లాంచ్ ప్యాడ్, ఎర్త్, డస్కటిల్ డౌన్, ట్రాక్ ట్రివియా, ఎస్ డీసీ గేమ్స్, స్వ్యాప్ స్టాప్, బాంబ్స్ అవే, మోడల్ మేనియా, నియాన్ క్రికెట్, స్టాక్ ఫిషర్, గెస్చర్ డ్రిఫ్ట్, ప్రాజెక్ట్ షోకేస్, మెటల్యూజన్.

నియాన్ క్రికెట్



చీకటి గదిలో నియాన్ బ్యాట్లు, బంతులు, స్టంప్‌తో నిర్వహించే నిర్వహించే ఆసక్తికరమైన క్రికెట్ ఈవెంట్ ఇది. గత టెక్నోజియాన్‌లోనూ దీనిని నిర్వహించారు. నియాన్ క్రికెట్ ఆడటానికి విద్యార్థులు ఎక్కువ ఆసక్తి చూపారు.



వీఆర్ స్పేస్ టూర్

టెక్నోజియాన్‌లో మరో హైలైట్ ఈవెంట్ వీఆ ర్ స్పేస్ టూర్. కళ్లజోడులాగా ఉండే ఒక పరికరాన్ని ధరించి అందులో నుంచి త్రీడీ పింటర్ సహాయంతో అంతరిక్షంలోని అద్భు తాలను వీక్షించవచ్చు. అంతేకాకుండా దీని ని ధరించి ఆర్చరీ, ఇతరత్రా గేమ్స్‌ను కూ డా ఆడవచ్చు.

ఇతర ఈవెంట్లు

వీటితోపాటు జాతీయ స్థాయిలో నిర్వహించిన గేమింగ్, కోడింగ్ మారథాన్ అయిన ది బ్లేజ్ ఈవెంట్ పాల్గొనేవారి ప్రోగ్రామింగ్, సమస్య పరిష్కార నైపుణ్యాలను పరీక్షించింది. షార్క్ ట్యాంక్ 2.0 అనే ఈవెంట్ కొత్త ఆవిష్కర్తలు, ఎంట్రప్రెన్యూవర్లు తమ వినూత్న ఆలోచనలను నిపుణుల సమక్షంలో ప్రదర్శించిన పోటీ. రాకెట్ డిజైన్ అండ్ లాంచ్ (లాంచ్ ప్యాడ్) ఈవెంట్ ద్వారా విద్యార్థులు రూపొందించిన మోడల్ రాకెట్లను విజయవంతంగా ప్రయోగించి, వైమానిక గుణకాలు, ప్రొపల్షన్ సూత్రాలను ప్రదర్శించింది. స్వ్యాప్ స్టాఫ్ అనే ఈవెంట్ సృజనాత్మకత, ఫుడ్ సైన్స్ కలయికతో ఐస్ క్రీమ్ తాయారీ పోటీ విద్యార్థుల్లో ఉత్సాహాన్ని రేపింది. మెటల్యూషన్, భూకంప నిరోధక భవన రూపల్పన, కౌన్ బనేగా సివిల్ ఇంజనీర్, జెశ్చర్ డ్రిఫ్ట్ కార్ రేస్, కోడ్ రెడ్, మ్యూటాడార్ట్ మెకానికల్ కిట్ అసెంబ్లీ తదితర ఈవెంట్లు టెక్నోజియాన్‌లో హైలైట్‌గా నిలిచాయి.

హద్దులను చెరిపేసుకో..

- అపజయాలకు వెరవకు.. విజయం కోసం శ్రమించు..
- గుర్తింపు కోసం వెంపర్లాడకు.. మన శ్రమే గుర్తింపునిస్తుంది..
- చినాబ్ బ్రిడ్జి ఫేమ్ ప్రొఫెసర్ మాధవీలత
- నిట్ టెక్నోజియాన్ కార్యక్రమంలో ప్రసంగం



టెక్నోజియాన్ కార్యక్రమంలో ప్రసంగిస్తున్న ప్రొఫెసర్ మాధవీలత

హనుమకొండ, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మన జీవితం.. మన వ్యక్తిత్వం విశాలం కావాలంటే మన చుట్టూ ఉన్న హద్దులను చెరిపేసుకోవాలని, అదే సమయంలో మన పరిమితులేమిటో కూడా గుర్తెరగాలని ప్రపంచంలో కెల్లా అత్యంత ఎత్తైన వంతెన నిర్మాణంలో క్రియాశీల భూమిక పోషించిన బెంగళూరు ఐఐఎస్‌సీ ప్రొఫెసర్ జి. మాధవీలత పిలుపునిచ్చారు. శుక్రవారం వరంగల్ నిట్‌లో టెక్నోజియాన్-2025 ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జ్యోతి ప్రజ్వలన చేసి సాంకేతికోత్సవాన్ని ప్రారంభించారు.

ఈ సందర్భంగా ప్రొఫెసర్ మాధవీలత మాట్లాడుతూ.. జీవితంలో ఉన్నంతంగా రాణించాలని అందరూ అనుకుంటారని, కానీ తమ చుట్టూ ఉన్న అడ్డంకులను చూసి కుంగిపోతారని అన్నారు. నిర్ణీత లక్ష్యసాధన దిశగా ముందడుగు వేయాలంటే ముందు ఆ అడ్డంకులను ఛేదించుకొని తమను తాము విస్తరించుకోవాలని అన్నారు. అదే సమయంలో మన పరిమితులు ఏమిటో తెలుసుకోవాలన్నారు. అపజయాలకు ఎవరూ వెరవద్దన్నారు. జీవితంలో ప్రతీఒక్కరు ఎప్పుడో ఏదో ఒక సందర్భంలో ఫెయిల్ అవుతుంటారని, అంత మాత్రాన భయపడి పోయి వెనకడుగు వేస్తే ఏదీ సాధించలేమన్నారు. అపజయం వెంట విజయం ఎప్పుడూ ఉంటుందని, మనం చేయాల్సిందల్లా దాని వెంట పరుగు తీయడమేనన్నారు. గుర్తింపు కోసం వెంటపర్లాడరాదన్నారు. ఐడెంటిటీ క్రైసిస్ వల్ల జీవితంలో మనం అనుకున్నది సాధించలేమన్నారు. ఎవరూ మిమ్మల్ని గుర్తించకపోయినా చేయాల్సిన పనిచేసుకుంటూ పోతే గుర్తింపు తప్పనిసరిగా లభిస్తుందన్నారు. ఇందుకు తానే ప్రత్యక్ష ఉదాహరణగా పేర్కొన్నారు. వరంగల్ ఆర్ ఈసీలో (ప్రస్తుతం నిట్) చదువుకున్న తాను.. గుర్తింపు కోసం ఏనాడు పాకులాడలేదన్నారు. చెనాబ్ వంతెన నిర్మాణం పూర్తయిన తర్వాత అందులో తన పాత్రేమిటో తెలిసిన తర్వాత అందరూ తనను ప్రత్యేకంగా గుర్తించడం మొదలు పెట్టారన్నారు. తాను ఎంటెక్ చదివిన వరంగల్ నిట్‌ను సైతం ప్రత్యేకంగా ప్రస్తావిస్తున్నారని అన్నారు. తాము ఎక్కడ చదువుకున్నా, ఎక్కడ ఉద్యోగం చేసినా నిజాయితీగా మన ధర్మాన్ని నెరవేర్చినప్పుడు గుర్తింపు దానంతట అదే వస్తుందన్నారు. వరంగల్ నిట్‌లో చదువుకున్నప్పటికీ పూర్వవిద్యార్థిగా ఇప్పటివరకు పేరు నమోదు చేసుకోలేదని, చెనాబ్ వంతెన నిర్మాణం తర్వాత కళాశాల యాజమాన్యం పలు మార్లు అలుమ్నీగా రిజిస్టర్ కావలసిందిగా కోరిందన్నారు. అలుమ్ని అవార్డును కూడా ప్రదానం చేయనున్నట్టు ప్రకటించిందన్నారు. వరంగల్ నిట్ ఒక అద్భుతమైన విద్యా కేంద్రంగా మాధవీలత అభివర్ణించారు. తాను ఎంటెక్ విద్యార్థిగా ఉన్నప్పుడు తన పురోగతికి సహకరించిన ఆనాటి అధ్యాపకులందరినీ పేరు పేరునా గుర్తుకు తెచ్చుకున్నారు. నాడు వారు అందించిన జ్ఞానం, జీవితం పట్ల కల్పించిన దృక్పథం తన ఉన్నతికి ఎంతో దోహదం చేసిందన్నారు. వరంగల్ నిట్ తనకు జీవితంతో పాటు జీవిత భాగస్వామిని కూడా ఇచ్చిందని ధన్యవాదాలు తెలిపారు. తన భర్త ఇదే కళాశాలలో ఎంటెక్ (మెకానికల్) చేశాడని, ప్రస్తుతం గూగుల్‌లో కీలక పదవిలో ఉన్నారన్నారు.

వరంగల్ నిట్ డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాధర్ సుబుధి మాట్లాడుతూ.. టెక్నోజియాన్ విద్యారుల నవ ఆవిష్కరణల సమాహారం అన్నారు. సృజనాత్మకతకు వేదికగా అభివర్ణించారు. ఆలోచనలు పరస్పర పంచుకోవడం ద్వారా శాస్త్ర సాంకేతిక రంగాల్లో ఎన్నో అద్భుతాలను సాధించవచ్చునన్నారు. అందుకు టెక్నోజియాన్ వంటివి ఎంతో దోహదపడుతాయన్నారు. సాంకేతిక ప్రధాన కార్యదర్శి డాక్టర్ యు.వెంకన్న టెక్నోజియాన్ ఉద్దేశ్యాన్ని వివరించారు. సృజనాత్మకత, సహకారం, సాంకేతిక ప్రతిభను పెంపొందించడం, ప్రాజెక్ట్ ఎక్స్‌పో, ఉమెన్ ఇన్‌టెక్ ఫోరం, జాతీయస్థాయి బ్లేజ్ గేమింగ్ అండ్ కోడింగ్ మారథాన్ వంటి ఈవెంట్లు విద్యార్థులు మేధాశక్తికి మరింత పదును పెడతాయన్నారు. స్టూడెంట్ వెల్ఫేర్ డీన్ డాక్టర్ కె.కిరణ్ కుమార్ మాట్లాడుతూ.. 2006లో ప్రారంభమైన టెక్నోజియాన్.. ప్రస్తుతం దేశంలోని అతిపెద్ద సాంకేతికోత్సవాల్లో ఒకటిగా ఎదిగిందన్నారు. ఈ ఏడు సుమారు 7వేల మంది విద్యార్థులు, వివిధ విద్యాసంస్థల నుంచి మరో వెయ్యి పాల్గొంటున్న ఈ టెక్నోజియాన్ జాతీయ స్థాయిలో తన ప్రభావాన్ని మరింతగా ప్రతిబింబిస్తోందన్నారు. ఫ్యాకల్టీ వెల్ఫేర్ డీన్ ప్రొఫెసర్ పి.రాధాక్రిష్ణ టెక్నోజియాన్ బృందం చూపిన నిబద్ధతను ప్రశంసించారు. తొలుత టెక్నోజియాన్-2025 అధికారిక వీడియోను, గత ఎడిషన్ల ముఖ్య ఘట్టాలను ప్రదర్శించారు.



టెక్నోజియాన్ ప్రారంభ కార్యక్రమానికి హాజరైన విద్యార్థులు

చినాబ్ వంతెన ఓ అద్భుతం

అనంతరం ప్రపంచంలోనే ఎత్తైన చినాబ్ రైల్వే వంతెనపై ప్రొఫెసర్ జి.మాధవీలత వైజ్ఞానిక ప్రసంగం చేశారు. ఈ వంతెన నిర్మాణంలో తన 17 ఏళ్ల అనుభవాన్ని విద్యార్థులతో పంచుకున్నారు. చినాబ్ వంతెన, రూపకల్పన, నిర్మాణం గురించి పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. 359 మీటర్ల ఎత్తులో చెనాబ్ నదిపైన నిర్మించడంతో జమ్ముకశ్మీర్ ప్రాంతం ఆర్థికంగా, సామాజికంగా ఎంతో అభివృద్ధిని సాధించిందన్నారు వంతెన నిర్మాణంలో ఎదురైన సవాళ్లను వివరించారు. చెనాబ్ నిర్మాణం సందర్భంగా ఇంజనీరింగ్ ధృఢత్వం, సృజనాత్మకత, సంక్లిష్టసమస్యల పరిష్కారం, సమన్వయం ప్రాముఖ్యతను వివరించారు. రూపకల్పనలో కచ్చితత్వం, స్థలస్థాయి నిర్ణయాలు, బృంధ సమన్వయం- ఈమూడు అంశాల కలయికతోనే ఈ మహా ప్రాజెక్టు విజయవంతమైందని ప్రొఫెసర్ మాధవీలత పేర్కొన్నారు.

ఈ సారి టెక్నోజియాన్‌లో బాంబ్ అవే ఎగ్జిబిట్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో నిట్ విద్యార్థులు కేవలం రెండు రోజుల వ్యవధిలో దీనిని రూపొందించారు. రిమోట్‌తో ఎగిరే ఈ విమానం నుంచి నిర్దేశిత లక్ష్యిత ప్రదేశంలో గురి తప్పకుండా బాంబులు వేయగలుగుతుంది. క్యాంపస్‌లో దీనిని ప్రయోగాత్మకంగా ప్రదర్శించి చూపారు. విద్యార్థులను ఇది విశేషంగా ఆకట్టుకున్నది.



బాంబ్ అవే..

కార్ రేస్ ఈవెంట్

ఈ ఈవెంట్‌లో విద్యార్థులు ఎక్కువ సంఖ్యలో పాల్గొంటున్నారు. ఒక రూట్‌ను ఏర్పాటు చేసి వీటి మధ్యలో నుంచి రోబోరేస్ కార్లను రిమోట్ కంట్రోల్ సహాయంతో నడపాలి. రూట్‌లో నిర్ణీత మార్గంలో ప్రయాణించి గమ్యాన్ని చేరుకోవాలి. మధ్యలో ఎత్తుపల్లాలను చాకచక్యంగా అధిగమించాలి.



గ్రీటింగ్ రోబో

టెక్నోజియాన్‌లో విశేషంగా ఆకట్టుకుంటు న్న మరో ఎగ్జిబిట్ గ్రీటింగ్ రోబో. ఎవరైనా దీని దగ్గరికి వెళితే హాయ్.. అంటూ పలకరిస్తుంది. చేతిలో ట్రేతో ముందుకు, వెనకకు కదులుతూ ఉంటుంది. దీనిని సాధారణంగా ఆయా వేడుకల్లో అతిథు లను స్వాగతించేందుకు ఉపయోగించేలా రుద్రాక్షి అనే మెకానికల్ ఇంజనీరింగ్ విద్యార్థిని రూపొందించారు.



లైడిటెక్టర్

లైడిటెక్టర్ ఈవెంట్ కూడా టెక్నోజియాన్‌లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ ఈవెంట్‌లో పాల్గొనడానికి విద్యార్థులు పెద్ద సంఖ్యలో ఆసక్తి చూపారు. చర్మప్రతి స్పందన (స్వేదం) ఆధారంగా సమాధానాల నిజాయితీని కొలిచే వినూత్న సాంకేతిక ఆవిష్కరణ.



విద్య కాషాయీకరణ విధానాలను అడ్డుకోవాలి

- పీడీఎస్‌యూ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు నున్నా అప్పారావు
- కేయూలో పీడీఎస్‌యూ జిల్లా మొదటి మహాసభ



మహాసభలో మాట్లాడుతున్న అప్పారావు

కేయూక్యాంపస్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): దేశంలో బీజేపీ విద్య కాషాయీకరణ విధానాలను అడ్డుకోవాలని పీడీఎస్‌యూ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు నున్నా అప్పారావు పిలుపునిచ్చారు. శుక్రవారం కేయూ ఫార్మసీ కళాశాల సెమినార్ హాల్‌లో పీడీఎస్‌యూ జిల్లా మొదటి మహాసభ జరిగింది. ఈ సందర్భంగా నున్నా అప్పారావు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రజల్లో ఐక్యతను దెబ్బతీస్తూ దుర్మార్గపు రాజకీయాలు చేస్తున్నారని అన్నారు. ప్రపంచం శాస్త్ర, సాంకేతిక రంగంల్లో ముందుంటే మన దేశం కులమత విద్వేషాలతో రగులుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. దేశంలో నిరుద్యోగ సమస్య పెరుగుతోందన్నారు. ఏటేటా లక్ష ఉద్యోగాల హామీ నేరవేరడం లేదని ధ్వజమెత్తారు. మత, కుల రాజకీయాలను అడ్డుకుని తిప్పికొట్టాలని అన్నారు.

పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు మొగిలి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్యారంగ అభివృద్ధి ఎజెండాతో రాష్ట్రంలో అధికారం చేపట్టిన కాంగ్రెస్.. సమస్యల పరిష్కారంలో విఫలమైందని విమర్శించారు. స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను చెల్లించకుండా విద్యార్థులతో చెలగాటం ఆడుతోందన్నారు. ప్రైవేట్ సంస్థలను ప్రోత్సహిస్తూ ప్రభుత్వ వర్సిటీలను నిర్వీర్యం చేస్తోందని మండిపడ్డారు. వర్సిటీల్లో ఖాళీలను భర్తీ చేయాలన్నారు. ఈ సమావేశంలో పీడీఎస్‌యూ జిల్లా కార్యవర్గాన్ని ఎంపిక చేసి ప్రకటించారు. అధ్యక్షుడిగా వంశీకృష్ణ, ఉపాధ్యక్షుడిగా ఆదర్శ్, ప్రధాన కార్యదర్శిగా రాచకొండ రంజిత్, సహాయ కార్యదర్శులుగా భిక్షిత్‌రెడ్డి, డ్యానియల్, కోశాధికారిగా ముషారఫ్, సభ్యులుగా ఆదిత్య, ఈశ్వర్, సాయి, యుగేందర్, పృథ్వీలను ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో పీడీఎస్‌యూ రాష్ట్రనేత సుత్రాపు అనిల్, కీర్తి, సాయి, మానస, ఆధిత్య, రఘురాం, రఘువరన్, శివసాయి, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అందే వరకు పోరాటం

- టీఆర్పీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రజినీకుమార్ యాదవ్



టీఆర్పీ ముఖ్య నాయకుల సమావేశంలో పాల్గొన్న రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మాదం రజినీకుమార్ యాదవ్ తదితరులు

హనుమకొండ టౌన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలో బీసీలకు అన్ని రంగాల్లో 42 శాతం రిజర్వేషన్లు అందే వరకు పోరాటం చేస్తామని టీఆర్‌పీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మాదం రజినీకుమార్ యాదవ్ అన్నారు. శుక్రవారం హనుమకొండలో శారద ఫంక్షన్ హాల్‌లో టీఆర్‌పీ జిల్లా నియోజక వర్గ కన్వీనర్లు, కో కన్వీనర్ల నియామకంపై టీఆర్‌పీ ముఖ్యనాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన రజినీకుమార్ యాదవ్ మాట్లాడారు.

రాబోయే వంద రోజుల్లో బహుజనుల ఢంకా తెలంగాణ అంతటా మోగిపోతుందని అన్నారు. బహుజన రాజ్యమే టీఆర్‌పీ సంకల్పమని అన్నారు. మేమెంతో మాకంత.. నినాదంతోనే టీఆర్‌పీ పార్టీ ఏర్పడిందన్నారు. తీన్మార్ మల్లన్న నాయకత్వంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామన్నారు.

రాష్ట్ర కార్యదర్శి పల్లెబోయిన అశోక్ ముదిరాజ్ మాట్లాడుతూ.. ప్రతీ గ్రామంలో టీఆర్‌పీ జెండా గద్దె నిర్మించి జెండా ఎగురవేసి బహుజన ఉద్యమాన్ని గ్రామస్థాయికి తీసుకెళ్తామని అన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని వరంగల్, హనుమకొండ, మహబూబాబాద్, జనగామ, భూపాలపల్లి, ములుగు జిల్లాల నియోజకవర్గ కన్వీనర్ల నియామకం కోసం ముఖ్య నాయకులతో చర్చ జరిగినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గౌతం రవి పటేల్, ఇనుకాల ప్రణయ్, సామల చంద్రశేఖర్, పిట్టల వెంకటేశ్, జినుకు శ్రీనివాస్, సామల శ్రీలత, బత్తిని వెంకటేశ్ గౌడ్, మాదం నరేష్ యాదవ్, గండి వెంకటేశ్వర్ గౌడ్, పూజారి సత్యనారాయణ, గుగ్గిరాజు సయ్యద్ తదితరులు పాల్గొన్నారు.

ఊకల్ గుడిలో నాగుల చవితికి ఏర్పాట్లు

గీసుగొండ, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): గీసుగొండ మండలంలోని ఊకల్‌లో గల ప్రసిద్ధ నాగసుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో శనివారం అత్యంత వైభవంగా నిర్వహించే నాగుల చవితి వేడుకలకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఇక్కడ ఏటా నాగుల చవితి వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహిస్తారు. ఎంతో మహిమాన్వితత్వం ఇక్కడి నాగేంద్రుడిని దర్శించుకునేందుకు జిల్లా నలుమూలల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తారు. పుట్టలో పాలు పోసి స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకుంటారు. అంతేకాకుండా స్వామి దీక్షలు చేపట్టిన స్వాములు నాగబంధ కావడులతో ఊరేగింపుగా తరలివచ్చి మాల విరమణలు చేస్తారు. దీంతో ఆలయం భక్తుల సందడిగా మారుతుంది. కాగా, భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లను చేసినట్లు ఆలయ ప్రధాన అర్చకుడు సముద్రాల సుదర్శనాచార్యులు, ఆలయ కమిటీ చైర్మన్ రాజేశ్వర్‌రావులు తెలిపారు.



బంతి పూల అలంకరణలో నాగేంద్రుడు (ఫైల్)

పత్తికి విపత్తు

- పెట్టుబడులు రాక రైతులు దిగాలు
- వరుసగా కురిసిన వర్షాలతో దెబ్బతిన్న పంటలు
- ప్రత్యామ్నాయ పంటల సాగుకు రైతులు మొగ్గు



నారాయణతండాలో ఎర్రబడిన పత్తి పంట

దుగ్గొండి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): వానకాలంలో వరసగా వర్షాలు కురియగా రైతులు సాగు చేసిన పత్తి పంటతో తీవ్రంగా నష్టపోయారు. తెగుళ్ల దాడి, భారీ వర్షాలు వారిని కోలుకోకుండా చేశాయి. వానలు వరసగా కురియగా పత్తి పంట ఎర్రబడి పెరుగుదల లోపించి, పంట దిగుబడి తగ్గింది. ఎకరం సాగు చేస్తే 8 నుంచి 10 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని ఆశపడిన రైతులకు 4 క్వింటాళ్ల దిగుబడి రాని పరస్థితి ఏర్పడింది.

డివిజన్‌లో 58,612 ఎకరాల పత్తి పంట సాగు

నర్సంపేట డివిజన్‌లో 58,612 ఎకరాలలో పత్తి పంటను రైతులు సాగు చేశారు. చెన్నారావుపేట మండలంలో 10,618, ఖానాపురంలో 8,113, దుగ్గొండిలో 12,639, నల్లబెల్లిలో 11,457 ఎకరాలు, నెక్కొండలో 13,137 ఎకరాలు,నర్సంపేటలో 8,138 ఎకరాలు పత్తి పంటను రైతులు సాగు చేశారు. డివిజన్‌లో సాగు చేసిన పంటకు 4,68,898 క్వింటాళ్ల పత్తి దిగుబడి వస్తుందని ఆశించినా, అందులో సగం దిగుబడి రాని పరస్థితి ఉంది. రైతులు గత్యంతరం లేక పత్తి పంటను తొలగించి దాని స్థానంలో ఇతర పంటల సాగుకు రైతులు మొగ్గుచూపుతున్నారు.

వరసగా వానలు, తెగుళ్ల దాడి

జూలై నెలలో సాగు చేసిన నెల రోజుల తర్వాత నుంచి వరసగా వానలు కురియగా, ఆగస్టు, అక్టోబరు నెలలలో వరసగా భారీ వర్షాలు పడడంతో పంట ఎదుగుదల లేకపోవడంతో పాటు పంట ఎర్రబడిపోవడం, వివిధ రకాల తెగుళ్లు సోకడంతో పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. మొదటి పంట ఏరగానే పత్తి పంట ఎర్రబడిపోయింది. గతంలో పత్తి పంటను నాలుగు ధపాలుగా ఏరేవారు. ఇపుడు ఒక్కసారి ఏరుతూనే పంట ఎర్రబడిపోతుంది. దీంతో రైతులు సాగు చేసిన పత్తి పంటను తొలగించి ప్రత్యామ్నాయ పంటల సాగుకు ఇష్టపడుతున్నారు.. పత్తి పంట సాగు చేసిన భూమిలో మొక్కజొన్న, వేరుశనగ సాగు చేయడానికి రైతులు ముందుకు వస్తున్నారు.

పంటకు గిట్టుబాటు ధర లేక..

పండిన కొద్దిపాటి పత్తిపంటకు సరైన ధరలేక పోవడంతో రైతులు దిగాలు చెందుతున్నారు. పత్తి పంటకు క్వింటాల్‌కు రూ:14 వేలు గతంలో ధర పలికింది. తర్వాత రూ:10 వేలు ధర పలికింది. సీసీఐ ధర రూ:8110 నిర్ణయించగా నేడు మార్కెట్లో రూ:7000 వరకు ఉంది. నాణ్యత పేరుతో రూ: 6600 మాత్రమే ధర పలుకుతుంది. సాగు చేసిన పంటకు పెట్టుబడి సైతం రావడం లేదని రైతులు ఆవేదన వ్యక్త పరుస్తున్నారు.

అధిక వర్షాలతో పంట దిగుబడి తగ్గింది

పాలడుగుల చంద్రమౌళి, రైతు, తిమ్మంపేట



గత ఏడాది తెగుళ్లు, అధిక వర్షాలతో పంటలు, పత్తి పంట దెబ్బతిని నష్ట పోగా ఈ ఏడాది కూడా భారీ వర్షాలతో పత్తి పంట నష్టపోయాం ఆగస్టు, అక్టోబరు నెలలలో వరసగా వానలు పడడంతో సాగు చేసిన 4 ఎకరాలలో పత్తి పంట దెబ్బతింది. కొద్ది పాటి పంట రాగ దానిని మొదటి సారి ఏరగానే పంట ఎర్రబడింది. ఎకరానికి రూ:20 నుంచి రూ.30 వేల వరకు పెట్టుబడి పెట్టగా, ఎకరానికి 2 క్వింటాళ్ల దిగుబడి రాని పరిస్థితి ఏర్పడింది. రెండు నెలల ముందుగానే పత్తి పంటను తొలగించి ప్రత్యామ్నాయ పంట సాగుకు సిద్ధమవుతున్నాం.

వరుసగా కురిసిన వర్షాలతో పత్తి పంటకు నష్టం

నరహరి కృష్ణారెడ్డి, రైతు తిమ్మంపేట



ప్రకృతి వైపరీత్యాల కారణంగా వరసగా కురిసిన వర్షాలతో మూడు ఎకరాలు సాగు చేయగా పత్తి పంట దెబ్బతిని దిగుబడి రాలేదు. పంట ఎదుగుదల లేక పోవడంతో పాటు పంట ఎర్రబడింది. పండిన పంటను కూలీలను పెట్టి ఎర్రగా విచ్చిన దిగుబడి పెట్టుబడులు రాక , కూలీల కూలీ రేటు రాని పరస్థితి ఉంది. సుమారుగా రూ:60 వేలు పెట్టుబడి పెట్టగా రూ:20 వేలు కూడ రాని పరస్థితి ఉంది. ఎకరం పంటకు 3 క్వింటాళ్లు రాని దుస్థితి ఏర్పడింది. రైతుకు మిగిలింది అప్పు మాత్రమే. పండించిన పంటకు గుట్టుబాటు ధర కల్పించాలి.

'మెనూ ప్రకారం భోజనం అందించాలి'

- కేజీబీవీ ప్రిన్సిపాల్‌పై ఎస్టీ కమిషన్ సభ్యుడు హుస్సేన్‌నాయక్ అసహనం
- నాసిరకం సరుకులు, నిర్వహణ సరిగాలేదని అసంతృప్తి
- రాష్ట్ర విద్యాశాఖ డైరెక్టర్ నికోలస్‌కు ఫోన్లో ఫిర్యాదు



మహమూద్‌పట్నం కేజీబీవీలో విద్యార్థినులతో మాట్లాడుతున్న హుస్సేన్‌నాయక్

కేసముద్రం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : పేద, బడుగు, బలహీన వర్గాలకు చెందిన విద్యార్థినులకు చెందిన కస్తూర్బాగాంధీ బాలికల గురుకులంలో నాణ్యమైన సరుకులతో మెనూ ప్రకారం భోజనం అందించాలని జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్‌నాయక్ ఆదేశించారు. మహమూద్‌పట్నం కేజీబీవీని శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా గురుకులంలో తరగతి, వంట, నిల్వ గదులు, ఇతర మౌళిక సదుపాయాలను పరిశీలించారు. డిజిటల్ తరగతి గదిలో ఇంటర్‌నెట్ లేకపోవడం, కూరగాయలు కుళ్లిపోయి, సరుకులు నాసిరకంగా ఉన్నాయని, స్టాక్ రిజిష్టర్ ఇవ్వాలని ప్రిన్సిపాల్‌ను హుస్సేన్‌నాయక్ అడగగా లేదని, ఆడిటింగ్‌కు పంపామని ప్రిన్సిపాల్ సోమలక్ష్మి తెలపడంతో ఆమెపై అసహనం వ్యక్తం చేశారు. తాను తనిఖీకి వస్తున్న విషయం తెలిసినప్పటికీ నిల్వ రిజిష్టరును అందుబాటులో ఉంచకపోవడంతోపై ప్రిన్సిపాల్ నిర్లక్ష్యంపైఅసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ హాస్టల్‌లో నాణ్యమైన సరుకులు వాడడంలేదని, మెనూ ప్రకారం భోజనం పెట్టడంలేదని, నిర్వహణ సక్రమంగా లేదని, ఇక్కడి సమస్యలను వెంటనే తనిఖీ చేసి పరిష్కరించాలని రాష్ట్ర విద్యాశాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్‌కు హుస్సేన్‌నాయక్ ఫోన్లో ఫిర్యాదు చేశారు. ఆయన వెంట తహసీల్దార్ వివేక్, ఎంపీడీవో క్రాంతి, బీజేపీ జిల్లా నాయకుడు పొదిల నర్సింహారెడ్డి, మండల అధ్యక్షుడు రమేష్ పాల్గొన్నారు.

బీజేపీ జిల్లా అధ్యక్షుడికి పరామర్శ..

కేసముద్రంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు వల్లభ వెంకటేశ్వర్లు తల్లి లక్ష్మి ఇటీవలె మృతి చెందడంతో ఆయన్ను జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు హుస్సేన్‌నాయక్ పరామర్శించారు. ఈ సందర్భంగా లక్ష్మి చిత్రపటం వద్ద నివాళులర్పించారు.

● నెల్లికుదురు : మేజరాజుపెల్లి గ్రామానికి చెందిన బీజేపీ మండల నాయకుడు పర్నె ప్రభాకర్‌రెడ్డి భార్య పర్నే రమాదేవి అనారోగ్యంతో బాధపడుతోండడంతో జాతీయ ఎసీ కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్‌నాయక్ పరామర్శించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు చందు రాజుకుమార్, రాస యాకిరెడ్డి, నల్లాని పాపరావు, సంతోష్ పాల్గొన్నారు.



ఎమ్మెల్యే మురళీనాయక్‌కు వినతి పత్రం అందజేస్తున్న రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ (రెవా) బాధ్యులు

రిటైర్డ్ ఉద్యోగుల ఆత్మగౌరవాన్ని కాపాడాలి

- ఎమ్మెల్యే మురళీనాయక్‌కు రెవా వినతి

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : రిటైర్మెంట్ బెనిఫిట్స్ కోసం ఎదురు చూస్తున్న ఉద్యోగ, ఉపాధ్యాయుల ఆత్మగౌరవాన్ని కాపాడాలని రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ (రెవా) జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సంకా బద్రినారాయణ, గుగులోతు కిషన్ నాయక్, గౌరవ అధ్యక్షుడు పోమ గోవర్ధన్ అన్నారు. మహబూబాబాద్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం స్థానిక శాసన సభ్యులు భూక్య మురళీనాయక్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2024 మార్చి నుంచి నేటి వరకు ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగ, ఉపాధ్యాయులకు రావాల్సిన బెనిఫిట్స్ రాలేదని పేర్కొన్నారు. పిల్లల పెళ్లిలు, చదువులు, ఇంటి నిర్మాణాలకు తెచ్చిన అప్పులు, బ్యాంకుల ఈఎంఐలు చెల్లించలేక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నామని పేర్కొన్నారు. ప్రభుత్వ ఉద్యోగులుగా 35-40 సంవత్సరాలు విధులు నిర్వహిస్తే మాకు ఇచ్చే బహుమతి ఆత్మహత్యలేనన్నారు. ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా రిటైర్డ్ ఉద్యోగులు 27 మంది మృతిచెందారని తెలిపారు. ప్రభుత్వం ఇప్పటికైనా రిటైర్డ్ ఉద్యోగులకు రావాల్సిన బెనిఫిట్స్ మంజూరు చేసి ఆదుకోవాలని కోరారు. అంబటి రవీందర్, చంద్రమౌళి, యోగీశ్వర్‌రావు, నాగయ్య, రామయ్య, యాదగిరి, ఉమాదేవి, పద్మావతి, నిరంజన్‌రెడ్డి, ఇమామ్, విజయ్‌కుమార్, శ్రీహరి పాల్గొన్నారు.

ప్రతీ పౌరుడు చట్టాలను గౌరవించాలి : సీఐ

గూడూరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : ప్రతీ పౌరుడు చట్టాన్ని గౌరవించాలని సీఐ సూర్యప్రకాష్ అన్నారు. గూడూరు పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం పోలీస్ ఓపెన్‌హౌస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ పోలీస్‌స్టేషన్‌లో జరిగే విధుల పట్ల అవగాహన కల్పించారు. ప్రజల సురక్ష జీవనానికి పోలీస్‌శాఖ అంకితభావంతో పనిచేస్తున్నట్లు చెప్పారు. సమాజంలో శాంతిభద్రతలను కాపాడడమే కాకుండా ప్రతీ పౌరుడు చట్టాన్ని గౌరవించేలా, బాధ్యతతో ప్రవర్తించేలా ప్రేరణ కలిగిస్తున్నట్లు పేర్కొన్నారు. ఎవరైనా అనుమానాస్పద కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిస్తే వెంటనే పోలీస్‌లకు డయల్ 100కు సమాచారం ఇవ్వాలన్నారు. ఎస్సై బి.గిరిధర్‌రెడ్డి, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీఐ సూర్యప్రకాష్

తైక్వాండో పోటీలకు ఉమామహేశ్వర్ ఎంపిక



ఉమామహేశ్వర్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయ బృందం

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : జమ్ముకాశ్మీర్‌లో ఈనెల 26వ తేదీ నుంచి 30 వరకు జరిగే అండర్-17 ఎస్జీఎఫ్ఐ జాతీయస్థాయి ఉర్సు (తైక్వాండో) పోటీలకు విద్యార్థి ఉమామహేశ్వర్ ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ ఉపేందర్‌రావు తెలిపారు. మహబూబాబాద్ మోడల్ స్కూల్‌లో శుక్రవారం జాతీయస్థాయికి ఎంపికైన విద్యార్థిని శాలువా కప్పి, ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెల్లికుదురులో ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి ఎస్జీఎఫ్ రాష్ట్రస్థాయి ఉర్సు పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి జాతీయస్థాయికి ఎంపికైనట్లు పేర్కొన్నారు. ఎస్జీఎఫ్ రాష్ట్రస్థాయి ఉర్సు అండర్-17 విభాగంలో ఉత్తమ ప్రతిభ కనబరిచి జాతీయస్థాయికి ఎంపికైన విద్యార్థి ఉమామహేశ్వర్ పీడీ సింధు వర్మ, జావిద్, సీపీఐ మాజీ మునిసిపల్ ఫ్లోర్‌లీడర్ అజయ్ సారథిరెడ్డి, ఉపాధ్యాయ బృందం అభినందించారు.

అదనపు తరగతి గదులు మంజూరు చేయాలి



సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న టీపీజేఏసీ రాష్ట్ర కో-కన్వీనర్ మైస శ్రీనివాస్, సభ్యులు

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ జిల్లాలోని కంబాలపల్లి, జమాండ్లపల్లి, రామన్నపేట, పతిపాక ప్రభుత్వ పాఠశాలలకు అదనపు తరగతి గదులు మంజూరు చేయాలని తెలంగాణ పీపుల్స్ జాయింట్ యాక్షన్ కమిటీ రాష్ట్ర కో-కన్వీనర్ మైస శ్రీనివాస్ విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్‌లో శుక్రవారం ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, రాష్ట్ర సమగ్రశిక్ష అదనపు డైరెక్టర్ రాదారెడ్డి లకు వేర్వేరుగా వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా కేంద్రంలోని హనుమంతునిగూడెం, కేసముద్రం మండలంలోని బ్రహ్మంగారితండాల్లోని ప్రాథమిక పాఠశాలల భవనాలు అసంపూర్తిగా ఉన్న నిర్మాణాలను పూర్తి చేసే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలకు ప్రహరీ నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. గత కొన్ని సంవత్సరాలుగా అభివృద్ధికి నోచుకోని పాఠశాలలను అభివృద్ధి చేయాలని, మన ఊరు-మన బడి పథకంలో ఎంపికైన పాఠశాలల్లో చేపట్టిన పనులకు నిధులు మంజూరు చేసిపూర్తి చేయించాలన్నారు. ఆయా కార్యక్రమాల్లో నాయకులు బోగేశ్వర్, మహబూబ్ అలీ, ధర్మేంద్ర పాల్గొన్నారు.

నవంబర్ 1న చలో హైదరాబాద్

నెహ్రూసెంటర్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి గవాయ్‌పై జరిగిన దాడికి నిరసనగా ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ సంఘాల ఆధ్వర్యంలో నవంబర్ 1న జరుపతలపెట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎమ్మెస్పీ జిల్లా ఇన్‌చార్జి ముమ్మిడివరపు చిన్న సుబ్బారావు మాదిగ పిలుపునిచ్చారు. మహబూబాబాద్ ఓసీ క్లబ్‌లో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గుగ్గిళ్ల పీరయ్య, కందిపాటి బిక్షపతి, కంటిపుడి అరుణ్, చలగోల వెంకన్న, డీహెచ్.కేసు, భూక్య వెంకన్న, బుడియ రాములు, కాలేరు జ్యోతి, శ్రీనివాస్, మాతంగి అనిల్, కొమ్ము నాగరాజు, సహదేవుడు, కొండ వెంకటేశ్వర్లు, జల్లె ఉపేందర్, మంద యాకమల్లు, పులి సోమయ్య, గండమల్ల సంజీవ, మిర్యాల శ్రీను, మధు, శేషం కిరణ్, బందెల కిరణ్ పాల్గొన్నారు.

మహా జాతరకు నిరంతర విద్యుత్

- 259 ట్రాన్స్‌ఫార్మర్ల ద్వారా సరఫరా
- 911 పోల్స్‌తో 61.17 కిలోమీటర్లు కొత్త లైన్లు
- భక్తులకు అసౌకర్యం కలగకుండా మరమ్మతు పనులు
- మేడారంలో ఎన్పీడీసీఎల్ డైరెక్టర్ల వెల్లడి



విద్యుత్ మరమ్మతు పనులను పరిశీలిస్తున్న అధికారులు

తాడ్వాయి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : మేడారం మహా జాతరకు నిరంతరం విద్యుత్ అందించేలా చర్యలు చేపట్టడం జరిగిందని ఎన్పీడీసీఎల్ డైరెక్టర్లు మధుసూదన్, మోహన్‌రావు వెల్లడించారు. ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారంలో చేపట్టిన విద్యుత్ మరమ్మతు పనులను శుక్రవారం వారు పరిశీలించారు. మహా జాతరకు ఏర్పాటు చేస్తున్న విద్యుత్ ఏర్పాట్ల వివరాలను చీఫ్ ఇంజనీర్ రాజు చౌహాన్, ఎస్ఈ మల్హార్ నాయక్‌లను అడిగి తెలుకున్నారు. మేడారంలో కనురెప్ప పాటు విద్యుత్ అసౌర్యం కలుగవద్దని అధికారులకు, సిబ్బందికి సూచించారు. సమస్యలు ఉన్న ప్రాంతాలను గుర్తించి ముందుగానే పరిష్కరించుకోవాలన్నారు. ఆయా ప్రాంతాలను నోటీసులో ఉంచుకోవాలని చెప్పారు. అనంతరం మాట్లాడుతూ మేడారం మహా జాతరకు నిరంతరం విద్యుత్ అందించేలా మరమ్మతు పనులు చేపట్టినట్లు తెలిపారు. 259 ట్రాన్స్‌ఫార్మర్ల ద్వారా విద్యుత్ సరఫరా చేయడం జరుగుతుందన్నారు. 911 పోల్స్‌తో 61.17 కిలోమీటర్లు నూతన విద్యుత్ లైన్లు ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. జాతరలో 350 మంది సిబ్బంది విధులు నిర్వహిస్తారని తెలిపారు. ముఖ్యంగా ప్రమాదాలు జరుగకుండా చర్యలు చేపడుతున్నామన్నారు. జాతర సమయంలో విద్యుత్ అంతరాయాలు కలుగకుండా ఉండేందుకు పస్రా, కమలాపూర్ 132/33 కేవీ సబ్‌స్టేషన్ నుంచి మూడు 33 కేవీ లైన్ల ద్వారా విద్యుత్ సరఫరా అవుతుందన్నారు. పస్రా, కమలాపూర్ సబ్‌స్టేషన్ నుంచి తాడ్వాయి మీదుగా మేడారంలో ఉన్న సమ్మక్క, సారలమ్మ సబ్‌స్టేషన్‌కు విద్యుత్ సరఫరా అవుతుందని తెలిపారు. అదేవిధంగా పస్రా నుంచి కొత్తూరు సబ్‌స్టేషన్‌కు, నార్లాపూర్ సబ్‌స్టేషన్‌కు విద్యుత్ సరఫరా అవుతుందన్నారు. సమస్యలు ఉత్పన్నం కాకుండా పటిష్టమైన ఏర్పాట్లు చేస్తున్నామని అన్నారు. ఈ క్రమంలోనే మేడారం పరిసరాల్లో విద్యుత్ మరమ్మతు ఏర్పాట్లను తిరిగి పరిశీలించడం జరిగిందన్నారు. అంతేకాకుండా అధికారులకు పలు సూచనలు చేసినట్లు వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక డీఈ నాగేశ్వరావు, కన్‌స్ట్రక్షన్ డీఈ సదానందం, ఏఈలు, లైన్ ఇన్‌స్పెక్టర్లు, లైన్‌మన్‌లు, సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లాలో మోస్తరు వర్షం

మహబూబాబాద్ అగ్రికల్చర్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని కేసముద్రం, కొత్తగూడ, బయ్యారం, గూడూరు, దంతాలపల్లి, తొర్రూరు, మానుకోట మండలాల్లో శుక్రవారం మోస్తరు వర్షం కురిసింది. డోర్నకల్, మరిపెడ, నెల్లికుదురు, నర్సింహులపేట మండలాల్లో ఉదయం నుంచి సాయంత్రం వరకు ముసురు పెట్టింది. కాగా, గురువారం రాత్రి నుంచి శుక్రవారం ఉదయం 8.30 గంటల వరకు జిల్లా వ్యాప్తంగా 106.4 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. సగటున 6.7 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. కొత్తగూడలో 12.8, గంగారంలో3.2, బయ్యారంలో 2.4, గార్లలో 35.8, డోర్నకల్‌లో 15.0, కురవిలో 6.8, మహబూబాబాద్‌లో 2.2, గూడూరులో 11.0, కేసముద్రంలో 0.4, నర్సింహులపేటలో 3.4, చిన్నగూడూరులో 4.0, మరిపెడలో 2.2, దంతాలపల్లిలో 3.4, తొర్రూరులో 1.2, పెద్దవంగరలో 2.6 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది.

శనిగపురంలో అదనపు కలెక్టర్ తనిఖీలు

మహబూబాబాద్ టౌన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మహబూబాబాద్ మునిసిపల్ పరిధిలోని శనిగపురం గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, మండల ప్రజా పరిషత్ పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాన్ని జిల్లా అదనపు కలెక్టర్ లెనిన్‌వత్సల్ టొప్పో శుక్రవారం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. విద్యార్థుల, ఉపాధ్యాయుల హాజరు రిజిస్టర్లను పరిశీలించి స్టోర్ రూమ్‌ను తనిఖీ చేశారు. విద్యార్థులను పాఠ్యాంశాల్లోని ప్రశ్నలు అడిగి వారి అభ్యసన సామర్థ్యాలను పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని తెలిపారు. ఉపాధ్యాయులు సకాలంలో హాజరు కావాలన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



సోమయ్య కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న మున్నూరుకాపు సంఘం నాయకులు

ఇనుగుర్తి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : ఇనుగుర్తిలో ఇటీవలె మృతి చెందిన జడల సోమయ్య కుటుంబానికి శుక్రవారం మండల మున్నూరుకాపు సంఘం ఆధ్వర్యంలో రూ.5వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఆ సంఘం అధ్యక్షుడు పింగిళి శ్రీనివాస్, ఆది చందు, బొర్ర శ్రీనివాస్, కొంతం నరేందర్, మలిశెట్టి రవి, జడల నాగేశ్వర్‌రావు, కుళ్ల రాజయ్య, శ్రీరాం చందర్, అల్లపు రాములు, కొంతం వెంకన్న, పింగిళి రాజు పాల్గొన్నారు.

తండ్రికి తలకొరివి పెట్టిన కూతురు

ఇనుగుర్తి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : చిన్నముప్పారంలో గురువారం రాత్రి ఆవుల పాపయ్య (35) గుండెపోటుతో మృతి చెందగా ఆయనకు ఒక్కగానొక్క కూతురు సౌమ్య ఉండడంతో శుక్రవారం నిర్వహించిన అంత్యక్రియల్లో ఆమె తన తండ్రికి తలకొరివి పెట్టారు. మృతుడికి భార్య అనిత ఉన్నారు.

విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

(5వ పేజీ తరువాయి)

మాట్లాడుతూ ప్లాస్టిక్ నిషేధాన్ని సీరియస్‌గా తీసుకుని, దాని వాడకాన్ని తగ్గించి భవిష్యత్ తరాలకు మేలు చేయాలన్నారు. రాత్రి సమయాల్లో ప్లాస్టిక్ కవర్లు దిగుమతి అవుతున్నాయని, పోలీసులు వాటిపై నిఘా పెంచాలన్నారు. ఈ సమావేశంలో కమిషనర్ టి.రాజేశ్వర్, డీఈ ఉపేందర్, టౌన్ సీఐ మహేందర్‌రెడ్డి, టీపీవో సాయిరాం, మేనేజర్ శ్రీధర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు కరుణాకర్, రాజేష్ పాల్గొన్నారు.

మోడల్ స్కూల్‌లో తనిఖీలు..

మహబూబాబాద్ శివారు అనంతారం మోడల్ స్కూల్‌లో ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. మధ్యాహ్న భోజన వంటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు ఇబ్బందులు కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి పెద్దపీట వేస్తుందని తెలిపారు. టీచర్ల మధ్య విభేదాలు, పాఠశాలపై నిర్లక్ష్యం చూపడం బాధకరమన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఇద్దరు ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలని డీఈవో దక్షిణమూర్తిని ఆదేశించారు.

అంతా మా ఇష్టం..?!

(5వ పేజీ తరువాయి)

తావిస్తోంది. కాగా, ఒక అధికారి ఉత్తరాలకి స్పందించిన రాష్ట్ర మైనార్టీ గురుకుల సెక్రటరీ, జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి, ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్‌ను విచారణకు ఆదేశించారు. విచారణ చేపట్టిన అధికారులు ఆ బాధిత ఉద్యోగి నుంచి ఎలాంటి వివరణ తీసుకోకుండానే తమకు అనువైన వారితోనే విచారణ తతంగాన్ని మమ అనిపించి నివేదికను సెక్రటరీకి పంపించినట్లు విశ్వసనీయంగా తెలిసింది. ఆపై సెక్రటరీ నుంచి ఎటువంటి నిర్ణయం వెలువడలేదని తెలుస్తోంది.

బాధిత ఉద్యోగిని జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారిని కలిసి తనకు న్యాయం చేయాలని కోరుతూ వినతి పత్రం అందించినప్పటికీ ఫలితంలేకుండా పోయినట్లు తెలుస్తోంది. ఖాళీ అయిన సబ్జెక్టు టీచర్ పోస్టును భర్తీ చేసేందుకు నోటిఫికేషన్ ద్వారా దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల విద్యార్హతలు, మెరిట్ ఆధారంగా భర్తీ చేయాల్సి ఉంటుంది. కానీ, ఎలాంటి నోటిఫికేషన్ ఇవ్వకుండానే వరంగల్ జిల్లాకు చెందిన అభ్యర్థి ద్వారా టీజీటీ సైన్స్ పోస్టును ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా భర్తీ చేశారనే ఆరోపణలు వినవస్తున్నాయి. ఇది ఇలా ఉండగా ఖాళీగా ఉన్న మహబూబాబాద్ మైనార్టీ జూనియర్ కళాశాలలో ఇంగ్లీష్ అధ్యాపక పోస్టు, తొర్రూరు గురుకుల పాఠశాలలో ఉర్దూ ఉపాధ్యాయురాలు మరణిస్తే ఆ పోస్టులను కూడా ఎలాంటి నోటిఫికేషన్ లేకుండానే భర్తీ చేసినట్లు సమాచారం.

కాగా, తొర్రూరు జూనియర్ కళాశాలలో 02, డోర్నకల్ పాఠశాలలో 01 పోస్టు భర్తీకి వరంగల్ జిల్లాలోని ఓ మండల కేంద్రంలో ఓ ఏజెన్సీ ద్వారా పేపర్ ప్రకటన చేయడం గమనార్హం. ఇదిలా ఉండగా డోర్నకల్ మైనార్టీ గురుకుల పాఠశాల సైన్స్ ఉపాధ్యాయురాలి తొలగింపు, నూతన ఉపాధ్యాయురాలి నియామకంపై జిల్లా మైనార్టీ సంక్షేమశాఖ అధికారి శ్రీనివాసరావును వివరణ కోరగా పాఠశాలలో ఖాళీ అయిన భౌతిక రసాయన శాస్త్ర సబ్జెక్టు ఉపాధ్యాయురాలు నియామకం ప్రభుత్వ నిబంధనల ప్రకారమే భర్తీ చేశామని చెప్పారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

కేసముద్రం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల సందర్భంగా కేసముద్రం మండల విద్యావనరుల కేంద్రంలో శుక్రవారం మండలంలోని వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులకు వ్యాసరచన పోటీలను ఎస్ఐ కాంత్రికిరణ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. 'డ్రగ్స్ ముప్పు, నివారణలో పోలీసుల పాత్ర, విద్యార్థులు డ్రగ్స్ నుంచి ఎలా దూరంగా ఉండవచ్చు' అంశాలపై ఈ పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లోని మొదటి ముగ్గురికి శనివారం బహుమతులు అందజేస్తామని ఎస్ఐ తెలిపారు. ఎస్ఐతో పాటు ఎంఈవో కాలేరు యాదగిరి, ఏఎస్ఐ ధర్మానాయక్, డబ్ల్యూపీసీ రజిత పాల్గొన్నారు.



ఎంఆర్‌సీలో వ్యాసరచన పోటీలో పాల్గొన్న విద్యార్థులు



బ్లీచింగ్ పౌడర్‌ను చల్లిస్తున్న సబ్‌యూనిట్ ఆఫీసర్ శ్రీనివాస్

పరిశుభ్రతను పాటిస్తేనే ఆరోగ్యం

- వైద్యశాఖ సబ్ యూనిట్ ఆఫీసర్ శ్రీనివాస్

మహబూబాబాద్ టౌన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : వ్యక్తిగత, ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే సంపూర్ణ ఆరోగ్య వంతులుగా జీవించవచ్చని వైద్యశాఖ సబ్‌యూనిట్ ఆఫీసర్ వడ్డెబోయిన శ్రీనివాస్ అన్నారు. మహబూబాబాద్ పట్టణ శివారు గుమ్మూనూర్‌లో ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్, సుందరయ్యనగర్‌ను శుక్రవారం పరిశీలించారు. సుందరయ్యనగర్‌లో బ్లీచింగ్ పౌడర్‌ను చల్లించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ చెత్త చెదారం లేకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం వల్ల దోమలను నివారించి సీజనల్ వ్యాధులను అరికట్టవచ్చన్నారు. గత సంవత్సరంతో పోలిస్తే ఈ సంవత్సరం డెంగీ, మలేరియా, చికెన్‌గున్యా వ్యాధులు తక్కువగా ఉన్నాయని తెలిపారు. అందరి సహకారంతో సీజనల్ వ్యాధులను నియంత్రించగలిగామన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎం జి.విజయకుమారి, ఆశ వర్కర్లు ఉమ, కమల పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలకు రూ.20 వేల విలువచేసే ఫ్యాన్లు అందజేత

కేసముద్రం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : నూతనంగా ఏర్పాటైన కేసముద్రం ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు స్థానిక లక్ష్మి ఐరన్ షాపు యజమాని కరివేదుల కృష్ణారెడ్డి రూ.20వేల విలువైన ఎనిమిది సీలింగ్ ఫ్యాన్లను శుక్రవారం అందజేశారు. ప్రభుత్వ కళాశాలలోని విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డి.రాజు, అధ్యాపకులు ప్రవీణ్, మైసయ్య, యాదగిరి, రమేష్, రవి, రాజు, పొలెపల్లి రమాదేవి, ఎం.డీ.మున్ని, మంజుల, లెంకల సంతోష్‌రెడ్డి పాల్గొన్నారు.



డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌కు ఫ్యాన్లు అందజేస్తున్న కృష్ణారెడ్డి